ట్రాక్టర్‌పై నుండి పడి బాలుడు మృతి

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణ మున్సిపాలిటీ శ్రీరామ్ నగర్ కాలనీలో పండగ పూట విషాదం చోటుచేసుకుంది. తండ్రితో పాటుగా తాను గుడికి వెళ్తానంటూ ట్రాక్టర్ ఎక్కిన ఉల్లి అప్పారావు (7) అనే బాలుడు అదే ట్రాక్టర్‌పై నుండి కిందపడి మృతి చెందారు. ఈ ఘటనపై యలమంచిలి పట్టణ ఎస్సై కె.పాపినాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఉల్లి మంగరాజు అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు.

మంగళవారం దసరా పండగ కావడంతో ట్రాక్టర్‌ని కడిగి దుర్గాదేవి గుడికి పూజకు తీసుకుని వెళ్తున్నప్పుడు అతని కొడుకు ఉల్లి అప్పారావు కూడా తనతో వస్తాననడంతో తనపక్కన కూర్చోబెట్టుకోగా ఎ.ఎస్.ఆర్. కాలనీ సచివాలయం దగ్గరలోకి వచ్చేసరికి ట్రాక్టర్‌కి బ్రేక్ వేయడంతో ఉల్లి అప్పారావు ట్రాక్టర్‌పై నుండి కిందపడ్డాడు. అదే ట్రాక్టర్ చక్రం అప్పారావు తలపై నుండి వెళ్ళడంతో తల నుజ్జు నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

బాలుడు మృతదేహాన్ని మార్చురీకి తలరించి పోస్టు మార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటనపై మృతుని తల్లి ఉల్లి భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.పాపినాయుడు అన్నారు.

నయనానందంగా శమీపూజ

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారికి విజయదశమి సందర్భంగా మంగళవారం కొండ క్రింద ఉద్యానవనంలో శమీపూజను ఈఓ శ్రీనివాసమూర్తి, అధికార, సిబ్బంది, భక్తుల సమక్షంలో ప్రధాన అర్చక స్వాములు జి. శ్రీనివాసా చార్యులు, స్థానాచార్యులు టిపి రాజగోపాల్ సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. రామాయణ కాలంలో శ్రీరాముడు తల్లి కోరిక మేరకు అరణ్యవాసంకు వెళ్లగా, రావణాసురుడు మారువేషంలో వచ్చి సీతాపహరణ గావించగా వానర సేనల సహకారంతో సీతను రావణుడు చెరబట్టిన విషయాన్ని తెలుసుకున్న రాముడు చివరకు రావణునితో యుద్ధానికి వెళ్లే ముందు శమీపూజ చేసినట్లు కొందరు చెబుతారు. అనంతరం జరిగిన రామరావణ యుద్ధంలో రాముడు విజయం సాధిస్తాడు. ఇంతటి విశిష్టత, పవిత్రత ఉండటం చేతనే నాటి పురాణ కాలం నుంచి నేటి వరకు ఏటా విజయ దశమినాడు చెడుపై మంచి సాధించిన విజయానికి గురుతుగా శమీపూజను ఆచరించటం ఆనవాయితీ. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రాజాలంకారంలో మెట్లమార్గంలో పల్లకిలో కొండ దిగువకు తీసుకువచ్చి కొండ క్రింద ఉద్యాన వనంలో శమి వృక్షం కొమ్మను కోసి అప్పన్న స్వామి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి దంపతులు దర్శించుకున్నారు. అదేవిధంగా ప్రముఖ వ్యాపార వేత్త సి.ఎం.ఆర్ మావురి వెంకటరమణ తమ కుటుంబ సభ్యులతో స్వామివారి నిత్యాన్నదాన ప్రసాదంకు రూ.1,00,000/-, చందన సమర్పణకు రూ.1,00,000/- లు నగదును విరాళంగా పర్యవేక్షకులు శ్రీనివాసుకు అందజేశారు.

సమాజ సేవలో శిష్టకరణాల అసోసియేషన్

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: సేవకు మారుపేరు కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ అని రాష్ట్ర మెట్రో రైలు కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యుజెఎం.రావు అన్నారు. కూర్మన్నపాలెం శిష్టకరణాలు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. నేటి కాలంలో స్వార్థం వీడి సమాజ సేవే పరమావధిగా జీవించాలని, ఇందుకు కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ నిదర్శనమన్నారు. శిష్టకరణాలకు ఓబీసీ సాధనే లక్ష్యంగా ముందుకు సాగటం జరుగు తుందని, త్వరలోనే సాధ్యపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర శిష్టకరణ ప్రధాన కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి, అసోసియేషన్ కార్యదర్శి డి.సత్యారావు, అధ్యక్షుడు పీఎస్వీఎస్.గోపాల్, ప్రతినిధులు డబ్బీరు గురునాధరావు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, కె.రవీంద్ర, బాబు పట్నాయక్, జె.సూర్యప్రకాష్, మానాపురం శివాజీ పట్నాయక్, ఉర్లం పస్రాద్, బగ్గం శ్రీనివాస పట్నాయక్, బీవీ ఎం.కృష్ణా, మంత్రి సత్యారావు, కె.ప్రసాద్, కె.రామ చంద్రరావు, జె.రమాకు మారి, శేఖరమంత్రి వరలక్ష్మి, ఉమా మహేశ్వరి, కళ్యాణి, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం వృద్ధులకు, వికలాంగులకు వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

బరితెగించిన వైసీపీ నేతలు

విశాఖలో మద్యం బాటిళ్లు, కోళ్లు బహిరంగంగా పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: తమ ప్రభుత్వం.. తమ ఇష్టారాజ్యం.. తమను అడ్డే వారు, అడిగేవారు లేరు.. చట్టం తనకు చుట్ట మంటూ కొంతమంది వైసీపీ నేతలు భరితగించి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తూ, మత్తులో ఉంచడమే లక్ష్యంగా మద్యం బాటిల్స్‌ను బహిరంగంగా పంపిణీ చేయడం విశాఖలో చర్చనీయాంశంగా మారింది. బహిరంగంగా దసరా పండగ వేళ కోళ్లు, మద్యం బాటిళ్లను దక్షిణ నియోజకవర్గంలో 31 వ వార్డు వైసీపీ నేతలు బాపు ఆనంద్ పంపిణీ చేయడంపై పలు రాజకీయ పార్టీల నేతలు విమర్శిస్తున్నారు. ప్రజల్లో మద్యం నియంత్రణకు అవగాహన కల్పించాల్సిన రాజకీయ నేతలే బహిరంగంగా మద్యం బాటిల్స్ పంపిణీ చేయడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. విశాఖలో వైసీపీ నేతలు మరి భర్తగించి ఇష్టారాజ్యంగా రౌడీ రాజ్యం నడుపుతున్నారని టిడిపి, జనసేన నేతలు ఆరోపిస్తున్నారు. దక్షిణ నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలకు అడ్డులేకుండా పోతుందని, ప్రజల్ని మత్తులో నింపి వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైసీపీ నేతలు ఈ విధంగా వార్డుల్లో బహిరంగంగా మద్యం పంపిణీకి పాల్పడుతున్నారని టిడిపి నేత గండి బాబ్జి విమర్శించారు.

సొంత నిధులతో రామాలయానికి విగ్రహాలు సమకూరుస్తాం

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని పరవాడపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి తన సొంత నిధులతో సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుని, లక్ష్మీ గణపతి విగ్రహాలను విరాళంగా అందజేస్తామని అనకాపల్లి వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. సోమవారం రత్నాకర్ పరవాడపాలెంలో శ్రీ కనక దుర్గమ్మను దర్శించిన అనంతరం అక్కడ నిర్మిస్తున్న రామాలయాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుతూ ప్రముఖ శిల్పులచేత సీతా రామలక్ష్మణులు, హనుమంతుడు, లక్ష్మీ గణపతి విగ్రహాలను సుందరంగా తయారు చేయించి అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రామాలయం కమిటీ చైర్మన్ గొంతిని లోవ అప్పారావు, వేగి దొరబాబు, గొంతిని గంగాధర్, మాజీ సర్పంచ్ డొప్పా రామోజీ, మాజీ ఉపసర్పంచ్ కల్లేపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గొంతుని శివసంచినాయుడు, పరవాడ కామేశ్వరరావు, ఖాతా రమణ, పరవాడ రమణ, వార్డు మెంబర్ గుర్రాల సత్యారావు, వేగి పవన్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: విజయదశమి పండుగను పురస్కరించుకొని ప్రతి ఏటా లాగే ఈ సంవత్సరం కూడా శ్రీ రావాలమ్మ బిల్డింగ్ కనస్ట్రక్షన్స్ యజమాని కన్నూరు సూర్యనారాయణ భవన నిర్మాణ కార్మికులు సుమారు 70 మందికి మూడు లక్షల రూపాయల విలువైన గృహోపకరణాలు మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని కింతాడ శివారు కూంద్రపువానిపాలెం జరిగిన కార్యక్రమంలో వంటపాత్రలు, వస్త్రాలు, మిఠాయి పాకెట్లను శ్రీ సత్య సాయి సేవా సంస్థల సేవాదళ్ జిల్లా సమన్వయ కర్త కశిరెడ్డి అప్పలనాయుడు శ్రీ సత్య సాయి భజన మండళ్ల మండల కన్వీనరు కన్నూరు అప్పలనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు శ్రీ రావాలమ్మ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ యజమాని కన్నూరు సూర్యనారాయణ సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోని వెంకటరావు, కన్నూరు చందు, కన్నూరు గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్వాగతం

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ మూడు రోజుల జిల్లా పర్యటనను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.యస్. జవహర్ రెడ్డి మంగళవారం సాయంత్రం 3-45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె యస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, తదితరులు విమానా శ్రయంలో ప్రధాన కార్యదర్శికి స్వాగతం పలికారు. అనంతరం వారు శారదా పీఠం బయలు దేరి వెళ్లారు.

గోవాడ గోడు పట్టించుకునేదెవరు..?

కార్మిక, కర్షకులకు బకాయి పేమెంట్లు తక్షణమే చెల్లించాలి

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని సహకార చక్కెర మిల్లులు అన్నింటిలో అన్ని రంగాల్లో అగ్ర పథాన నిలిచిన, నిలిపిన కార్మిక, కర్షకులకు బకాయి పడ్డ పేమెంట్లు సుమారు 12 కోట్లు తక్షణమే చెల్లించాలని ఏ.పి.చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు వెంకటరమణ (కాసు బాబు) డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఆవరణలో మంగళవారం వేచలపు మీడియాతో మాట్లాడారు. సహకార చక్కెర కర్మాగారంలో రాజకీయ జోక్యంతో ది చోడవరం సహకార చక్కెర కర్మాగారం(గోవాడ) పరిస్థితి ప్రస్తుతం అన్ని రంగాల్లో అత్యంత దయనీయంగా మారిందన్నారు. పూర్వపు పాలక మండళ్ళు, యాజమాన్యం, కుతంత్ర రాజకీయాలు, పంచదార, మొలాసిస్ అమ్మకాల్లో అవినీతి, నిర్వహణ లోపాలు వెరసి సభ రైతులు, కార్మికుల పాలిట శాపంగా మారి, పేమెంట్లు చెల్లించలేని స్థాయికి దిగజారిందన్నారు. ఫ్యాక్టరీలో పంచదార అమ్మకాలతో నిల్వలు అయిపోయినా బకాయిలు చెల్లించలేక పోయారని అన్నారు. అన్ని విధాలా రైతాంగాన్ని ఆదుకుంటాం అని చెబుతున్న అధికార ప్రభుత్వాలు ఆర్థిక సహకారం అందిస్తేనే కానీ ఈ ఏడాది చెరకు గానుగాట ఆడలేమని ఫ్యాక్టరీ యాజమాన్య వర్గాలు బోరున విలపిస్తున్నాయి. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని సుమారు 220 గ్రామాల్లో 25 వేల మంది సభ్య రైతు కుటుంబాలు, వెయ్యికి పైగా కార్మికులు కలిపి సుమారు లక్షకు పైగా చెరకు రైతులు గోవాడ సుగర్స్‌పై ఆధారపడి వున్నారు. గడిచిన 2022-23 క్రషింగ్ సీజన్లో 2 లక్షల 21 వేల 246 మెట్రిక్ టన్నుల చెరుకు గానుగాడగా 9.01 శాతం రికవరీతో, లక్షా 88 వేల 124 క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి జరిగింది. గతేడాది నిర్వహణ లోపంతో మిల్ టర్బైన్‌లు సక్రమంగా పనిచేయక పోవడం, కొత్తవి కొనుగోలులో లక్షలాది రూపాయల నష్టంతోపాటు, విద్యుత్ ఉత్పత్తి నిలిపివేతతో ఫ్యాక్టరీ ఆదాయానికి గండి పడింది. 2022-23 సీజన్లో చెరకు సరఫరా చేసిన సభ్య రైతులకు మొదటి విడతగా రూ.2500లు చొప్పున చెల్లించగా, రూ.321.25 పై.లు బకాయిలుండగా, గేట్ ఏరియా రైతులకు అదనంగా 50 రూ.లు చెల్లించాలి, వెరసి సభ్య రైతులకు చెల్లించాల్సినవి సుమారు 9 కోట్లు పైనే. కార్మికుల జీత భత్యాలకు 3 కోట్లు పైనే చెల్లించాలి, వెరసి ఫ్యాక్టరీ చెల్లింపుల బకాయిలు రూ.12 కోట్లు పై మాటే. ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని చెప్పిన ప్రజా ప్రతినిధులు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు. సకాలంలో చెరకు పెమెంట్లు చెల్లించక పోవడంతో, చెరకు సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయిందన్నారు. 12.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కో-జనరేషన్ ప్లాంట్ ఏర్పాటుతో కొంత వరకు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నా, యంత్రాలు పాత బడడంతో ప్రతీ ఏడాది మరమ్మత్తులకే కోట్లాది రూపాయిలు ఖర్చు చేస్తున్నారు. వీటి పుణ్యమా అని ఓవర్ ఆయిలింగ్, మరమ్మతుల పేరిట లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా గోవాడ చక్కెర ఫ్యాక్టరీను ఆదుకోవాలని కార్మిక, కర్షక సంఘాలు, ఏ.పి. చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు డిమాండ్ చేస్తున్నారు.

సైకో పోవాలి పోస్టర్లు దగ్ధం

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలోని కింతాడ శివారు జోగన్నపాలెం గ్రామంలో మాడుగుల నియోజకవర్గం టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు పిలుపు మేరకు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో "జగనాసుర దహనం" కార్యక్రమం సందర్భంగా సైకో పోవాలి పోస్టర్లను మంటలో వేసి దహనం చేశారు. సైకో పోవాలి అంటూ నినాదాలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులు కొట్టి వేసి తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు రొంగలి మహేష్, క్లస్టర్ ఇన్‌చార్జి లెక్కల మల్లేశ్వరరావు, ఎంపీపీ సబ్బవరపు రామునాయుడు, సర్పంచ్‌లు బొడ్డు అక్కునాయుడు, వెలగల పైడం నాయిడు, మాజీ సర్పంచ్ బండారు నరసిం హనాయుడు, శ్రీను, బూత్ ఇంచార్జి బొట్ట ముత్యాలు నాయుడు, పైలా ముత్యాల నాయుడు, జోగ దేముళ్ళు, బొట్ట కోనారి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు బొట్ట పాలవెల్లి, కదుపుట్ల గంగునాయుడు, ఎస్ కె రఫీ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన్న స్థితిలో దొంతల వారి కల్లాలు రోడ్డు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో ఆనందపురం పంచాయతీ పరిధిలో దొంతల వారి కల్లాలు రోడ్ పూర్తి అధ్వాన్న స్థితిలో ఉంది. సుమారు అర కిలోమీటర్ రోడ్డును అధికారులు, నాయకులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నేటికీ సుమారు ఐదు సంవత్సరాలు గడుస్తున్నా అప్పుడు వేసిన మెటల్ రోడ్డును అలాగే గాలికి వదిలేసారు. స్థానిక ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్‌కు గడపగడపలో మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానికులు వినతిపత్రం సమర్పించిన గాని ఇప్పటివరకు ఎటువంటి మార్పు లేదు రాలేదు. ఈ రోడ్డు గుండా అనేక వాహనాలు ప్రయాణం చేస్తాయి. నిత్యం అనేక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ కూడా ఎవరిలో ఎటువంటి చలనం లేదు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు చొరవ తీసుకొని ఈ రోడ్డు పరిస్థితిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గమ్మ సేవలో ఎంవీఆర్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ పరిధి కళ్యాణగిరి కొండపై వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ దుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో మంగళవారం కుటుంబ సమేతంగా ఎం.వి.ఆర్ పాల్గొని అమ్మవారికి అభిషేకాలు, పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ మేరకు ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఎంవీఆర్‌కు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దీనిలో భాగంగా ఆలయ పరిసర ప్రాంతాలను కమిటీ సభ్యులతో పరిశీలిం చారు. అనంతరం అమ్మవారి దర్శన కార్యక్రమంలో పాల్గొని అమితమైన భక్తితో అమ్మవారిని స్తుతించి దర్శన కార్యక్రమం పూర్తి చేశారు. చివరగా ఎంవీఆర్ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఆర్ యువసేన సభ్యులు, దుర్గమ్మ భక్తులు, ఆలయ ప్రతినిధులు, స్థానికులు, ఎంవీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలు స్వాధీనం

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం పాత మల్లంపేట పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో టేకుదుంగలు తరలింపుపై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందడంతో గొలుగొండ పోలీసులు సహకారంతో సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణరావు తన సిబ్బందితో కలిసి టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కలప తరలిస్తున్న యజమానిని అదుపులోకి తీసుకొని డిపోకు తరలించామని తెలిపారు. టేకుదుంగలు ఎక్కడ నుంచి వస్తున్నాయి అన్న దానిపై విచారణ చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా కలప తరలించడం నేరమని అన్నారు.

జాతీయ తైక్వాండోలో పతకాల పంట

విశాలాంధ్ర - మధురవాడ : తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 21 ,22 తేదీలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఆమెచూర్ తైక్వాండో అసోసియేషన్ 5వ అంతర్రాష్ట్ర ఆహ్వాన పోటీలు-2023 లలో మధురవాడ ఆనంద్ తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ క్లబ్‌కు చెందిన నలుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. బాలుర విభాగంలో ప్రథమ శ్రేణిలో 41 కేజీల విభాగంలో ఎస్.నిఖిల్ (బంగారు పతకం), 57 కేజీల విభాగంలో వి.వెంకటేష్ (బంగారు పతకం), బాలికల విభాగంలో ద్వితీయ శ్రేణిలో అండర్ 47 కేజీల విభాగంలో ఏ.పవిత్ర (రజత పతకం), అండర్ 51 కేజీల విభాగంలో పి.భార్గవి (రజత పతకం)లు పతకాలు సాధించారు. విజేతలకు అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ లా అండ్ ఆర్డర్ జె కులశేఖర్, మరో అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ అడ్మినిస్ట్రేషన్ జె వెంకటరావు ఆంధ్రప్రదేశ్ ఆమెచూర్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి గ్రాండ్ మాస్టర్ కే బాబురావు, అధ్యక్షులు వి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొని పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విజేతలకు చక్కని శిక్షణ ఇచ్చిన కోచ్ ఆనంద్‌ను పలువురు అభినందించారు.

ఈ పోటీలకు రిఫరీగా వ్యవహరించిన బి.హేమంత్ శ్రీనాథ్ ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఆనందరావు, సహాయ కార్యదర్శి వెంకట్(కర్నూల్), పోటీల నిర్వహణ కార్యదర్శి బాలకృష్ణ (తిరుపతి), ఏ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా పండగ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో దసరా పండుగ వైభవంగా నిర్వహించారు. దసరా సందర్భంగా దుర్గాదేవి ఆలయాలకు భక్తులు ఉదయం నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వాహనదారులు తమ వాహనాలకు అమ్మవారు ఆలయాల వద్ద వాహన పూజను చేయించారు. సోమవారం రాత్రి ధర్మవరం గ్రామంలో పండుగ సందర్భంగా భారీ డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల ప్రజలు వచ్చి తిలకించారు.

ఆలయానికి జనసేన విరాళం

విశాలాంధ్ర - వి.మాడుగుల: దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని మాడుగులలో గల దేవి తల్లి ఆలయానికి మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ రూ.25వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా రాయపురెడ్డి కృష్ణను కమిటీ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పివిజి.కుమార్, జనసేన నాయకులు గండెం రాంబాబు, గల్లా గణేష్, కోళ్ల చిన్న, ఆర్లి సురేష్‌కుమార్, చీడికాడ మండల జనసేన నాయకులు గుమ్మడి సంతోష్, చుక్కపల్లి కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ పైడిమాంబ సారె ఊరేగింపులో ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి: వేపగుంట శ్రీ పైడిమాంబ దేవాలయంలో శరన్నవ రాత్రులు సందర్భంగా ఆలయ ధర్మకర్త మామిడి రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని అమ్మవారి సారెను ఊరేగించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. సుమారు 3000 మందికి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి సూరిబాబు, తెలాసరి కనకరాజు, బొడ్డు దేముడుబాబు, కంచిబోయిన సంతోష్, గంట్ల నర్సింహా మూర్తి భక్తులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి పరిధి 40వ వార్డులో దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా మంగళవారం ఏకేసీ కాలనీ గ్రామదేవత శ్రీ నూకాంబిక అమ్మవారికి గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు



నాగేశ్వరరావు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, భూలక్ష్మి, గంట వర్మ, బాలు అప్పారావు, తాతబాబు, రాజు, రమణ, శ్రీను నూకరాజు, భవాని భక్తులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అరెస్ట్ అన్యాయం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్ర వ్యాప్త మనం చేద్దాం జగనాసుర దహనంలో భాగంగా ఆదివారం టీడీపీ శ్రేణులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్య క్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష పార్టీలను చూసి ముఖ్య మంత్రి జగన్ రెడ్డికి నిద్ర పట్టడం లేదని ముఖ్యంగా టీడీపీ పార్టీకి వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేక పోలీసులతో ఇటువంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్నారని, దమ్ము ధైర్యం ఉంటే ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం రా అని నాగ జగదీష్ సవాల్ విసిరారు. జగదీష్‌కు తన స్వగృహంలో నోటీసి ఇచ్చి అరెస్టు చేసి టౌన్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితి ఏర్పడడం వల్ల రైతాంగం పూర్తిగా నష్టపోయారని కరువు జిల్లాగా ప్రకటించాలని వైసీపీ ప్రభుత్వాన్ని టీడీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు గాను 1, లక్ష 06, వేల ఎకరాల్లో పంట నమోదయిందని సెప్టెంబర్ 30 నాటికి పంట సాగు నమోద చేసిన 78 శాతానికి మించి సాగలేదని, పాయకరావుపేట, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో సాధారణ విస్తీర్ణంలో సాగు సగం కూడా పంట నమోద కాలేదని నాగ జగదీష్ తెలిపారు. వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయని, జూన్ 1 నుండి సెప్టెంబర్ 30 వరకు 694.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 609.5 మిల్లీమీటర్ల కురిసిందని, చాలా చోట్ల వర్షపాతం లోటు ఉందని నాగ జగదీష్ తెలిపారు. పరవాడ, అనకాపల్లి, మాకవరపాలెం, మునగపాక, అచ్యుతాపురం, యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్ రాయవరం, రాంబిల్లి మండలాలలో వర్షపాతం లోటు ఉందని నాగ జగదీష్ అన్నారు. సాగైన పంటలో పెట్టుబడులకు కూడా పంట దిగుబడులు వచ్చే అవకాశం లేదని, కరువును పరిగణలోకి తీసుకొని స్వల్ప కాలిక పంటలకు విత్తనాలను రైతుకు ఉచితంగా సరఫరా చేయాలని, జలాశయాల నిర్వహణ సరిగా లేకపోవడం, తాండవ, కోణం, రైవాడ, పెద్దేరు, జలాశయాల కింద 75,414 ఎకరాల ఆయకట్టుకు,57,037 ఎకరాల్లో మాత్రమే వరి పంట సాగైందని, వర్షాభావంతో నక్కపల్లి మండలంలో 5,125 ఎకరాలకు 1212 ఎకరాల్లో కేవలం 24 శాతం మాత్రమే సాగు అయిందని, పాయకరావుపేటలో 7,920 ఎకరాలకు 255 ఎకరాలలో 36% మాత్రమే, రాంబిల్లి మండలంలో 6,815 ఎకరాలకు 3,130 ఎకరాలలో 46% వరి పంట నమోదయిందని నాగ జగదీష్ తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఇద్దరు మంత్రులు గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు పేరుకే మంత్రులుగా ఉన్నారని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కనీసం అవగాహన లేదని, వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ అధికారులను అడిగి తెలుసుకొని వ్యవసాయ అధికారులతో సమీక్ష ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవడానికి వీరు మనసు ఒప్పలేదని పేరుకే రైతు పక్షపాత ప్రభుత్వం అని ప్రకటనలకే పరిమితమయ్యారు తప్ప క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి రైతులను ఆదుకోవడానికి బదులుగా తెలుగుదేశం పార్టీని చంద్రబాబు నాయుడును విమర్శించడానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని నాగ జగదీశ్ ఏద్దేవా చేశారు.

ప్రస్తుతం జిల్లాలో వర్షాభావం, సాగు దిగుబడులను దృష్టిలో పెట్టుకొని పంట రుణాలను రద్దు చేయాలని జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నాగ జగదీష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ వాణిజ్య విభాగ అధ్యక్షులు నడిపెల్లి గణేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు కోడి నాగేశ్వరావు బొద్దేడ మురళి మళ్ళ గణేష్ పొలిమేర నాయుడు కోరుకొండ రమేష్ కోరుకొండ కోటేశ్వరరావు కేతా శ్రీనివాసరావు బండి అప్పలకొండ కరణం శ్రీనివాసరావు బుద్ధ భువనేశ్వరరావు విల్లూరి రమణబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారం శిశువులకు వరం

విశాలాంధ్ర - చింతపల్లి: గర్భిణీలు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం జన్మించే శిశువులకు వరమని, తద్వారా సమాజానికి ఆరోగ్యకరమని జడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ సచివాలయం 2 వాముగడ్డ కొత్తూరు గ్రామంలో ఆ పంచాయతీ కార్యదర్శి కిముడు పూర్ణచంద్రరావు, సర్పంచ్ గేమ్మెల లలిత, ఎంపీటీసీ సభ్యురాలు లువ్వాబు మీనా కుమారి ల ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన కార్యక్రమంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి మీ అరుదైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా అందించే వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐసిడిఎస్ వారు ఏర్పాటుచేసిన పోషకాహార స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి, వీఆర్వో ఎస్‌వి రమణమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి, పంచాయతీ వార్డు సభ్యుడు కరుణానిధి, వైకాపా నాయకులు సింహాచలం, మత్యలింగం, కార్తీక్ అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హరిపురంలో జగనాసుర దహనం

విశాలాంధ్ర-రాంబిల్లి: తెదేపా అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ మరో వినూత్న కార్యక్రమం చేపట్టింది. గతంలో చేపట్టిన 'మోత మోగిద్దాం', 'కాంతితో క్రాంతి', 'న్యాయానికి సంకెళ్లు' తరహాలోనే తాజాగా 'మనం చేద్దాంజగనాసుర దహనం' పేరుతో ఏపీ తెదేపా అధ్యక్షుడు అచ్చెన్నాయుడు,జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పిలువు మేరకు,టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆదేశాలతో వైకాపా ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండిస్తూ సోమవారం రాత్రి హరిపురం గ్రామంలో గల టీడీపీ కార్యాలయం నందు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దూళి రంగనాయకులు ' సైకో జగన్ పోవాలి' అని రాసిన పత్రాలను మంటల్లో వేసి దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అనే చెడుపై చంద్రబాబు అనే మంచి సాధించబోయే విజయంగా ఈ దసరా పండుగ చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు.ఈ సైకో ప్రభుత్వం నిజాయితీ గల నాయకుడిని జైల్లో బంధించి చంద్రబాబు నాయుడు ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారని, ఇది దుర్మార్గపు చర్య అని, రావణాసురుని రాముడు వధించినట్టే ఈ రాష్ట్ర ప్రజలు ఈ ప్రభుత్వాన్ని వధిస్తారని ,రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కాగానే రామరాజ్యం వస్తుందని ప్రజలందరూ తెలుగుదేశం పార్టీ మద్దతు తెలుపుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ ఖండించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధూళి రమణ, గ్రామ టీడీపీ అధ్యక్షులు ధూళి అప్పారావు, మండల యువత ఉపాధ్యక్షులు కోన అప్పల నాయుడు, పార్టీ నాయుకులు ధూళి అప్పారావు,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సిమెంటు రహదారిపై మురుగునీరు...

విశాలాంధ్ర - చింతపల్లి: మండల కేంద్రంలో పేరుకు పోతున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. స్థానిక రామాలయం వీధిలోని రాజమ్మ గరువు సమీపంలో నిర్మించిన సిమెంటు రహదారి పాదాచారులకు ఉపయోగపడకుండా పోయింది. మురుగునీరు పారే కాలువ కంటే సిమెంటు రహదారి నిర్మాణం లోతట్టుగా ఉండడంతో వరుసకు మీరే గాక ప్రజలు వాడే మురుగునీరు సిమెంటు రహదారిపై నిలిచిపోతుంది. దానిని కాలువలోకి మళ్లించడానికి పంచాయతీ పాలకవర్గం గానీ అధికారులు గానీ తాత్కాలిక చర్యలు తప్ప ఎటువంటి శాశ్వత చర్యలు చేపట్టకపోవడంతో మురుగునీరు పోయే మార్గం లేక దోమల వ్యాప్తికి దోహదపడుతుంది. గృహాల నడుమ ఉన్న ఈ రహదారిపై చేరిన మురుగునీరు దోమల వృద్ధితో పాటు, ప్రజలకు వ్యాధులు వ్యాపించేందుకు కారణమవుతుంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో డెంగ్యూ టైఫాయిడ్ తదితర వ్యాధుల బారిన పడి అనేకమంది ఆసుపత్రుల పాలైన విషయం పాఠకులకు తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొని పత్రికలలో పలుమార్లు కథనాలు ప్రచురితమైనప్పటికీ పాలకులు, సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చోద్యం చూస్తుండడంతో సమస్య మరింత జలయంగా మారుతుంది. ఇప్పటికైనా సంబంధిత పాలకులు, అధికారులు స్పందించి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ఘనంగా దుర్గాదేవి ఉత్సవ విగ్రహ ఊరేగింపు

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: మండలానికి చెందిన పద్మనాభరాజుపేట గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు సోమవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమ ముగింపు ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పి.ఎన్.ఆర్. పేట, బయ్యవరం ఉభయ గ్రామాల పురవీధుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఎంతో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటంతో పాటుగా ఇతరులు నిర్వహించిన తప్పెటగుళ్ళు తదితర కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. తిరువీధిలో తరువాత అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు గౌరీ శంకర్ శర్మ వేద మంత్రోచ్చారణల నడుమ గ్రామ శివారులో ఉన్న చెరువులోని నీటితో భవాని భక్తులతో జలాభిషేకం చేయించారు. అనంతరం భవాని మాలధారకులందరూ ఆ చెరువులో స్నానమాచరించి, దుర్గమ్మ వారి దర్శనానికి పలు వాహనాలలో విజయవాడకు పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొగ్గా గోవిందరావు, మొగ్గా బుజ్జి, జెర్రిపోతుల నానాజీ, రాయవరపు వెంకట్రావు, జెర్రిపోతుల వెంకట్, కలిగట్ల ఈశ్వరరావు, యడ్ల శీనుబాబు, యడ్ల ప్రకాష్, మొల్లి అప్పారావు, యరబోలు గోవిందరావు, కొలగాని బాబురావు హనుమంతు రమణ, కలిగట్ల శ్రీనుబాబు, కలిగట్ల నానాజీ, యడ్ల జానకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సెన్సొడైన్ భారత దంతవైద్య సంఘంతో భాగస్వామ్యం

విశాలాంధ్ర -విశాఖ సిటీ: హేలియన్ (మునుపటి గ్లాక్సోస్మిత్‌క్లైన్ కన్స్యూమర్ హెల్త్ కేర్) నుండి ఒక అగ్రగామి నోటి సంరక్షణ బ్రాండ్ అయిన సెన్సొడైన్, ప్రపంచ దంతవైద్యుల దినాచరణ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా తమ రోగుల మంచి నోటి సంరక్షణను చూసుకోవడంలో దంతవైద్యుల పాత్రను గుర్తించి మరియు సంబరం జరుపుకోవడానికి గాను భారత దంతవైద్య సంఘము (ఐడిఏ)తో భాగస్వామ్యం కుదుర్చుకొంది. దంతవైద్యుల సమాజములో ఈ నోటి ఆరోగ్య నిపుణుల పాత్రను గౌరవించడానికి గాను సెన్సొడైన్ మరియు ఐడిఏ, సర్వశ్రేష్టమైన రోగి ఫలితాల దిశగా పని చేయడానికి వారికి వీలు కలిగించేలా దంతవైద్య శాస్త్రములో అత్యాధునిక అంశాలను చర్చించడానికి దంతవైద్యుల కొరకు తనదైన-శైలి లోని ఒక వేదికను సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. దంతవైద్య రంగానికి సీనియర్ దంతవైద్యులు చేసిన విశేష దోహద సహకారాల కొరకు వారిని సన్మానించడానికి కూడా ఈ వేదిక ఉపయోగించుకోబడింది. ఈ చొరవలో భాగంగా అనేక నగరాల వ్యాప్తంగా పలు సమావేశాలకు ఆతిథ్యవ్వడం జరుగుతోంది. ఈ మహాసభలో పాల్గొన్నవారు ముఖ్య నోటిసంరక్షణ సమస్యలు, ముందస్తు ఆరోగ్య సంరక్షణ కొరకు అవసరము మరియు వారు చేపట్టిన కేసులలో అత్యంత సమస్యాత్మకమైన కొన్నింటి గురించి చర్చించారు. సాధారణ సమస్యలను గుర్తించడానికి మరియు వినూత్నమైన పరిష్కారాలను అన్వేషించడానికి ఇది సహాయపడింది.

ప్రతిపాదనలు వేశారు పని మరిచారు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో కూతవేటి దూరంలో ఉన్న లోడగలవానిపాలెం పంచాయతీ బాలికలు అనేకసార్లు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తారు. బాలికల వసతి గృహానికి వెళ్లే మార్గంలో శిథిలమైన రోడ్డును మండల ఇంజనీరింగ్ అధికారి వెంకటేశ్వర్లు ఇటీవల మూడు నెలల క్రితం పరిశీలించారు. రోడ్డు పొడవు, వెడల్పులు కొలతలు వేసి, నిర్మాణానికి అవసరమైన అంచనా ప్రతిపాదనలు రూపొందించి నెలలు కావస్తున్న నేటికీ పనులు మొదలు కాలేదు. రోడ్డు పనులు ప్రారంభిస్తామని గత సర్వసభ్య సమావేశంలో తెలియజేసినప్పటికీ అసలు పనులు ఎందుకు కావడం లేదో అర్థం కాలేదని వాపోతున్నారు. మండల కార్యాలయానికి కూత వేటి దూరములో ఉన్న రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా పూర్తి అధ్వాన స్థితిలో ఉండటం అధికారులు నివారణ చర్యలు చేపట్టకపోవడం బాధాకరం. దసరా సెలవులు ముగుస్తున్న విద్యార్థులు బాలిక వసతి గృహాలకు చేరుకొని ప్రతిరోజు ఈ రోడ్డు ద్వారానే పాఠశాలకు వెళ్ళవలసి పరిస్థితి నెలకొంది. ఏ రోజు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారించాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళ కె.నాగరాణి మాట్లాడుతూ శ్రమజీవుల కాలనీలో రోడ్డు, డ్రైనేజీలు అధ్వానంగా ఉండడంతో నానా అవస్థలు పడుతున్నామని, వీటిని బాగుచేసేందుకు ఎమ్మెల్యే అవంతి చర్యలు చేపట్టి పనులు పూర్తి చేయాలని కోరారు.

సీలేరు పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - సీలేరు: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని సీలేరు ఎస్సై ఎస్సై జె.రామకృష్ణ అన్నారు. విజయదశమిని పురస్కరించుకొని మంగళవారం సీలేరు పోలీస్ స్టేషన్‌లో దుర్గమ్మకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్టేషన్లోని అన్ని రకాల ఆయుధాలను అమ్మవారి ముందు ఉంచి ఆయుధ పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీదుర్గాదేవి తల్లి ఉత్సవ కమిటీకి రూ.30 వేలు విరాళం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల కేంద్రంలో ఆర్టీసి, సివిల్, ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ శ్రీ దుర్గా దేవి తల్లి ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు శ్రీదేవి ఆడిటోరియంలో విజయదశమి సందర్భంగా మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పైలా చేస్తున్న సేవలును కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీకి రూ.30వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో మాడుగుల టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రంజిత్ వర్మ, క్లస్టర్ ఇంచార్జి పుప్పాల రమేష్, ఎ ఎన్‌వి.ప్రసాద్, కర్రి ప్రసాద్, దంగేటి సూర్యారావు, దొర ఖండేపల్లి కొండబాబు, గుడుపు ఘాటీలు, నాగోజీ రమణ, దిమిలి సురేష్, బత్తుల ఎల్లారావు, కొండాజీ, బడ్డేటి మోదునాయుడు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

36వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా 75వ వార్డులో 36వ రోజు రిలే నిరాహారదీక్ష కొనసాగుతోంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో 75వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు ఈ రోజుతో 36 రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ రోజు దీక్షలో పాల్గొన్న నాయకులు ఈ దసరా పండుగ రోజు చెడుపై మంచి గెలవాలని, నారా చంద్రబాబు నాయుడు మీద పెట్టిన అక్రమ కేసులు వీగిపోవాలని కోరుకున్నాము అని అన్నారు. దీక్షలో కార్పొరేటర్ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, 75వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీమునిరి శ్రీనివాసరావు, గోక్యాడ ముత్యాలు, ములకలపల్లి పెంటయ్య, పెద్దాడ సోము నాయుడు, అండి బోయిన రాము నాయుడు, మొల్లి రమణ, మొల్లి అప్పల నాయుడు, శీరపు వెంకట రమణ, బొంగు రాజు, నంబారు సింహాద్రి, నామాల శ్రీకాంత్, టేకేటి అప్పారావు, దొమ్మేటి నాగరాజు, కాకినాడ అప్పల రాజు, బస అప్పల రెడ్డి, సరోజిని, కణితి సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సహజ ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - చోడవరం: ఆదివాసీ రైతుల వ్యవసాయ సహజ ఉత్పత్తుల కంపెనీ కార్యాలయాన్ని వ్యవసాయ శాఖ ఏ.డి. రవీంద్రనాథ్, అటవీ శాఖ అధికారి రాం నరేష్ లు స్థానిక లక్ష్మీపురం రోడ్డులో కేంద్ర నిర్వహణ(ప్యాకింగ్, మార్కెటింగ్,) కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు.

చిరు ధాన్యాలతో సహజసిద్ద ఆరోగ్యంగా ఉంటారని, పూర్వ కాలంలో వీటి వాడకం కారణంగానే పూర్నా యుష్కులు గాను, ఆరోగ్యంతోను, దృఢంగాను వుండే వారని తెలిపారు. ఆదివాసీ వ్యవ సాయ ఉత్పత్తులు తో తినుబండారాలు, వంటకాలు తయారు చేసే కేంద్రాన్ని ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆర్డీడీ తిరుపతిరావు. అధ్యాపకులు దేముడు, సీనియర్ జర్నలిస్ట్ రాం బాబు, ఆర్క్ ప్రసాద్, ముక్కా రమేష్, ధివ్యాంగుల జిల్లా సంఘం సమాఖ్య అధ్యక్షులు డి. రవికుమార్, టీవీ రమణ మాస్టర్, డిఫెన్స్ అకాడమీ గణేష్, కన్నయ్య శెట్టి, కాంట్రాక్టర్ సత్తి బాబు, లైన్ మెన్ సత్యన్నారాయణ, వాణి ప్రెస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చెడు విజయం సాధించేది లేదు.. మంచి ఓడేదీ లేదు

విశాలాంధ్ర - చింతపల్లి :- తెదేపా జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ తలపెట్టిన జగనాసుర దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం చింతపల్లి మండలంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని చౌడుపల్లి పంచాయితీ చవటపాడు గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షులు గొల్లోరి మంగు సమక్షంలోనూ, అదేవిధంగా చింతపల్లి మండల కేంద్రంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ ఇంటి వద్ద అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం, పార్టీ శ్రేణులు చిన్న పిలలతో కలిసి జగనా సుర దహనం కార్యక్రమం నిర్వహించారు, అదే క్రమంలో అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు లు తమ ఇంటి వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు అక్రమ అరెస్టుని నిరసిస్తూ సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినదీస్తూ జగనాసుర దిష్టిబొమ్మను దహన కార్యక్రమం నిర్వహించి ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలలో వారు మాట్లాడుతూ చెడుపై మంచి ఎప్పుడూ విజయం సాధిస్తుందన్నారు. దానికి ప్రతీకగానే దసరా పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ జరుపుకుంటారని త్వరలోనే చంద్రబాబు నిరాధారమైన ఆరోపణల నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనం మెచ్చిన కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర -చింతపల్లి :- జనం మెచ్చిన కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని వైకాపా అరకు పార్లమెంటు మాజీ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జల్లి హలియా రాణి దంపతులు అన్నారు. .ఆదివారం వారు మాట్లాడుతూ నిత్యం ప్రజల యోగక్షేమాలకై ఆలోచించే ముఖ్యమంత్రులు నాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్, నేడు ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లు అన్నారు. అధికారం చేపట్టిన నాటి నుండి నవరత్నాలు పేరిట రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంలోనూ, వివిధ కారణాలతో పథకాలు అందుకోలేని వారిని గుర్తించి జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని రూపొందించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి పథకాలకు అర్హులను చేయడంలోనూ, నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించి మారుమూల ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందించే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైకాపా ప్రభుత్వానికి ప్రజలు రుణపడి ఉండాలన్నారు. రాబోవు ఎన్నికలలో వైకాపాకు అండగా నిలిచి అత్యధిక స్థానాలలో వైకాపా అభ్యర్థులను గెలిపించి జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రిగా అధికార పీఠంపై కూర్చోబెట్టే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

గేదెల మురళీకృష్ణ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నంలో గేదెల మురళీకృష్ణ పుట్టినరోజు సందర్భంగా జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిండు నూరేళ్ళు ఐశ్వర్య ఆయురారోగ్యలతో ఉండాలని ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, కంపర సత్తిబాబు, కంపర కోటేశ్వరరావు, రాజస్థాన్ రాజు, బందారు శ్రీనివాసరావు,వర్మ, కిషోర్, బల్ల రమణ, తుంపాల శ్రీను, బెహరా సత్యనారాయణ, సంతోష్, సురేష్, రాజు, అక్కిరెడ్డి నాగరాజు, ధవళ మోహన్, గోల్కొండ శ్రీనివాసరావు, దాసరి శ్రీను, కర్రి సత్తిబాబు, కర్రి అప్పలస్వామి, బంటుపల్లి మహేష్, పులుసు గురునాథ్, అడవివరం కోపరేటివ్ బ్యాంక్ పాలకవర్గం సొసైటీ సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యంతో పులకించిన భక్త జనులు

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: మండలంలో బయ్యవరం గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్టించిన దుర్గాదేవి అమ్మవారి నిమజ్జన మహోత్సవ వేడుకలను సోమవారం గ్రామస్తులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రతిష్టించిన అమ్మవారి ప్రతిమను పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నట్లుగా తయారు చేసివ హంస వాహనంపై పుర వీధిల్లో ఊరేగించారు. హంస వాహనంపై ఊరేగుతున్న అమ్మవారిని చూసిన భక్తులు,కృష్ణానదిలో హంస వాహనంపై ఊరేగుతున్న విజయవాడ కనకదుర్గ అమ్మవారిని గుర్తు చేసుకుంటూ భక్తి పారవశ్యంతో పులకరించి తరించారు. ఈ కార్యక్రమంలో సకల శ్రీను, పందుల లోవరాజు, గెంజి గౌరీ శంకర్, నక్కన నూకేష్, రావూరి శ్రీనివాసరావు, అడపా శ్రీనివాసరావు, రావూరి అర్జునరావు, సియ్యాదుల శ్రీను తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

విశాలాంధ్ర - జికేవీధి: జికేవీధి మండలం బంతువలస ఘాట్ రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. వజంగి వైపు నుంచి రాజఒమ్మంగి వెళుతున్న బలెరో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడగా ఒకరు మృతి చెందగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.

డిటిగా పదోన్నతిపై హర్షం

విశాలాంధ్ర - జికేవీధి: జీకేవీధి మండలం దారకొండ గ్రామానికి చెందిన గడుతూరి ఈశ్వరరావుకు డిప్యూటీ తహశీల్దార్‌గా పదోన్నతి పొందటంపై దారకొండ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈశ్వరరావు విఆర్‌ఓగాతన ప్రస్థానం మొదలుపెట్టి అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ తాజాగా డిప్యూటీ తహశీల్దార్‌గా పదోన్నతి పొందారు. దీంతో పలువురు ఈశ్వరరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సాయిబాబా మహా సమాధి ఉత్సవం

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: పట్టణంగా ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద గల షిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం నాడు విజయదశమి, బాబా సమాధి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం కాకడ హారతి,పంచామృత అభిషేకాలు, దీపాలంకరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చిన ప్రతీ భక్తునికి ప్రసాద వితరణ చేశారు. అనంతరం యాధావిధిగా హారతి, పవళింపు సేవలు జరిగాయి. ఈ వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు .

వాలీబాల్ విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని కుంజ వారిగూడెం గ్రామంలో కొమరం భీమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీలలో గెలుపొందిన విజేతలైన కుంజ వారి గూడెం గ్రామం టీంకు మొదటి బహుమతిగా 20వేల రూపాయలు సున్నం రాజయ్య జ్ఞాపకార్థంగా మండల సిపిఎం పార్టీ నాయకులు, రెండవ బహుమతి చొప్పల్లి గ్రామ టీమ్‌కు ఏ ఎస్ డి ఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీ బాబు 15 వేల రూపాయలు, మూడవ బహుమతి వేగి తోట గ్రామ టీమ్‌కు జల్లి బాబురావు టీచర్, కణితి గణేష్ కరెంటు ఎఇ చింతూరు వారు 10వేల రూపాయలు విజేతలైన వీరికి మంగళవారం బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, కుంజా అర్జమ్మ, సర్పంచ్ రవ్వ సుజాత, గ్రామ పెద్ద మోసం పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.